# మొగిలిగిద్ద, చించోడ్ గ్రామాలను మండలాలుగా ప్రకటించాలి

- మండలాలుగా ప్రకటిస్తే భారీ విరాళం అందిస్తా.. సీఎం రాకను స్వాగతిస్తాం
- ప్రభుత్వం ఉండగా కళాశాల నిర్మాణానికి విరాళాలు ఎందుకు..?
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్, జనవరి 29 : ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద, చించోడ్ గ్రామాలను ప్రత్యేక మండలాలుగా ప్రకటించాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీఎం రాక నేపథ్యంలో బుధవారం పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో మొగిలిగిద్దను మండలం చేయలేదంటూ నాటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌పై తీవ్ర విమర్శలు చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. నేడు ఆ గ్రామాలను మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉంది మీరే కాబట్టి మండలాలుగా ప్రకటించి ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న ఆ గ్రామ ప్రజల కోరికను తీర్చాలంటూ సవాల్ విసిరారు. నోటి మాటలతో కాకుండా చేతల రూపంలో చూపించాలన్నారు. మొగిలిగిద్ద, చించోడ్ గ్రామాలను మండలాలుగా ప్రకటిస్తే తనవంతు సహాయంగా భారీ విరాళాలను అందించడంతో పాటు సీఎం రాకను సైతం స్వాగతిస్తామన్నారు. 152 ఏండ్ల చరిత్ర కలిగిన మొగిలిగిద్ద పాఠశాలకు విచ్చేస్తున్న సీఎం రాకను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు బీఆర్‌ఎస్ ఎప్పుడూ అడ్డుపడదని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి రాజకీయం లేదని, కేవలం ప్రజల తరపున అడుగుతున్నామన్నారు. మొగిలిగిద్ద, చించోడ్ గ్రామాల మండలాల ఏర్పాటును సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించాలని కోరారు.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కళాశాల నిర్మాణానికి సైతం నిధులు కేటాయించకపోవడంతోనే దాతల సహకారంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారా అని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. పెద్దపెద్ద కంపెనీలు, నాయకులు నిర్మాణ పనులకు భారీ విరాళాలు ఎందుకు ఇస్తున్నారో ప్రజలకు తెలుసని అన్నారు. ఏమీ ఆశించకుండానే కంపెనీల యాజమాన్యాలు విరాళాలు ఇస్తున్నారా ప్రశ్నించారు. కళాశాల భవనం నిర్మాణం పేరుతో వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కళాశాల నిర్మాణానికి నగదు రూపేణా కాకుండా వస్తు రూపంలో విరాళాలు సేకరించాలన్నారు. త్వరలోనే కళాశాల నిర్మాణ విరాళాలపై ఆరా తీస్తామన్నారు. విద్య పేరుతో వ్యాపారాన్ని చేయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు.

### మండలాలను ప్రకటించకుంటే ఉద్యమిస్తాం

ఎంతో చరిత్ర కలిగిన మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 152వ వసంతాల కార్యక్రమానికి విచ్చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద, చించోడ్ గ్రామాలను మండలాలుగా ప్రకటించాలంటూ గ్రామస్తులు కోరారు. మండలాలుగా ప్రకటించకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# ఇదెక్కడి న్యాయం..?

- రియల్టర్ పేర పలు రైతుల భూమి రిజిస్ట్రేషన్ చేసిన డిప్యూటీ తహసీల్దార్
- అన్నదాతల నిరసనతో దిగివచ్చిన అధికారి
- తిరిగి ఎవరి భూమి వారికి బదలాయింపు
- రైతులపైనే పోలీసులకు ఫిర్యాదు చేసిన రియల్టర్
- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- విచారణ పేరిట పదేపదే పిలుస్తున్నారని రైతుల ఆవేదన
- తమ మాటలు వినడం లేదని, తమ పత్రాలు పోలీసులు పరిశీలించడం లేదని ఆగ్రహం
- ఆర్డీవో, కలెక్టర్, ఎస్పీ దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని వెల్లడి



ఏండ్ల తరబడి కబ్జాలో ఉండి ఆన్‌లైన్ పాస్ బుక్‌లు ఉన్నట్లు చూపిస్తున్న రైతులు

పూడూరు, జనవరి 29 : రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్లు.. రెవెన్యూ శాఖ అధికారులు అనుకుంటే ఎవరి భూమినైనా రియల్టర్ల పేర్లపై మార్చొచ్చని ఆ శాఖ అధికారులు నిరూపించారు. పూడూరు మండలం చన్గోముల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.496లో 10ఎకరాల 22 గుంటల భూమి ఉన్నది. ఈ భూమి 2013 నుంచి గఫార్‌ఖాన్ 2.2 గుంటలు, ఇమ్రాన్‌ఖాన్ 20 గుంటలు, ఎండి ఇస్మాయిల్ ఒక ఎకరం, మల్గ అంజయ్య 3 ఎకరాలు, మల్గ బుచ్చమ్మ ఒక ఎకరం, మల్గ మల్లేశం ఒక ఎకరం, మల్గ బుచ్చమ్మ 2 ఎకరాల చొప్పున రికార్డులతో పాటు కబ్జాలో ఉంటూ పంట సాగుచేస్తున్నారు. కబ్జాలో ఉన్న రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా డిప్యూటీ తహసీల్దార్ కిశోర్ మచర్ల గగన్‌రెడ్డి పేరున ఈ నెల 4, 6, 7 తేదీల్లో గుంటల లెక్కన పలుమార్లు రిజిస్ట్రేషన్ చేశారు. జనవరి 10న ఓ రైతు బ్యాంక్‌లో రుణం పొందేందుకై ఆన్‌లైన్‌లో సర్వే నం.496లోని భూమిని పరిశీలించగా.. గగన్‌రెడ్డి పేరున రికార్డులో కనిపించడంతో రైతులు కంగుతిన్నారు. దీంతో రైతులందరూ మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి పరిశీలించగా.. డిప్యూటీ తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. గగన్‌రెడ్డి 2009లో జీపీఏ ఉందంటూ స్లాట్ బుక్ చేసి 10 గుంటల చొప్పున 34 డాక్యుమెంట్లు చేయడంతో తాము రికార్డులను పరిశీలించకుండానే వారి పేరున రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. తమకు తెలియకుండానే అధికారులు గగన్‌రెడ్డి పేరున భూమి చేయడంతో కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేశారు.

దీంతో సంక్రాంతి పండుగ అనంతరం బాధిత రైతుల్లో ఒకరైన మల్లేశం పేరుపై జీపీఏ చేసి.. తరువాత మిగతా రైతులందరికీ ఎవరి భూమి వారికి డిప్యూటీ తహసీల్దార్ బదిలీ చేశారు. చేతికొచ్చిన భూమి చేజారడంతో రియల్టర్ గగన్‌రెడ్డి బాధిత రైతులపై ఫిర్యాదు చేశాడు. మల్లేశం చీటింగ్ చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు విలేకరుల సమాశంలో తెలిపారు. దీంతో ఏండ్ల తరబడి కబ్జాలో ఉన్న రైతుల రికార్డులు పోలీసులు పరిశీలించకుండానే పరిగి, చన్గోముల్ పోలీస్ స్టేషన్‌ల చుట్టూ విచారణ పేరుతో పోలీసు రైతులను తిప్పుకోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని చన్గోముల్, అంగడి చిట్టంపల్లి ఇరు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీల,ఆర్డీవోలకు సైతం తమకు జరిగిన అన్యాయంపై వివరించి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు రైతులు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆన్‌లైన్ పాస్ బుక్ ఉన్న రైతుల పేర్లు తొలగించి ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయడం సరైంది కాదని.. రైతులకు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ షకీల్, యాదవరెడ్డి, రహీస్‌ఖాన్, మల్లయ్య, చెన్నయ్య, అమర్‌నాథ్, నర్సింహులు, బాధితుల కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.



## జోరుగా వేరుశనగ కోతలు

కేశంపేట, జనవరి 29 : వేరుశనగ పంటను సాగు చేసిన రైతులు పంట చేతికి రావడంతో కోతలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పల్లెల్లోని కూలీలు ప్రస్తుతం వరి నాట్లు వేసేందుకు పెద్ద సంఖ్యలో వెళుతుండడంతో వేరుశనగ సాగు చేసిన రైతన్నలు కూలీల కోసం ఎదురు చూస్తున్నారు. కేశంపేట మండలవ్యాప్తంగా 1,400 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రైతులు సాగు చేసిన పంట ఒకేసారి చేతికి రావడంతో అటు యంత్రాలు, ఇటు కూలీల కొరత ఏర్పడింది. వేరుశనగ పంట పెద్ద మొత్తంలో ఒకేసారి కోతకు రావడంతో అటు యంత్రాలతోపాటు ఇటు కూలీలకు డిమాండ్ పెరిగింది.

### యంత్రాలకు భలే గిరాకీ

పంట కోతకు రావడంతో చెట్టు నుంచి వేరుశనగను వేరు చేసే యంత్రాలకు భలే గిరాకీ ఏర్పడింది. దీని కోసం రైతులు వారం రోజుల ముందునుంచే యజమానులను కలుస్తూ తమ ఆర్డర్లను బుక్ చేసుకుంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. యంత్రం యజమానులు ఒక ఎకరాకు రూ.4వేల వరకు రైతుల నుంచి వసూలు చేస్తున్నారని, అత్యవసరం ఉన్న రైతులు ఎకరాకు మరో రూ.500- రూ.1000 వరకు అదనంగా చెల్లిస్తున్నారు. ఓ వైపు కూలీల కొరత, మరోవైపు యంత్రం యజమానుల అధిక డిమాండ్‌వల్ల రైతన్నలకు ఇక్కట్లు తప్పడంలేదు.

## జాతీయస్థాయి లంగడి పోటీలకు ఎంపిక



యశస్విని, యజ్ఞ, నిహాంత్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట, జనవరి 29 : మున్సిపాలిటీ పరిధి కుంట్లూరుకు చెందిన వేముల యశస్విని, వేముల యజ్ఞ, దామోదర్, నిహాంత్‌రెడ్డి జాతీయస్థాయి లంగడి పోటీలకు ఎంపికయ్యారు. లంగడి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి తమిళనాడులో నిర్వహించే సబ్ జూనియర్, సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

## భయంకర శబ్దాలు.. భయాందోళనలో ప్రజలు

కొడంగల్, జనవరి 29 : మండలంలోని రుద్రారం, టేకల్‌కోడ్, ధర్మాపూర్, ఉప్పర్‌పల్లి, అంగడిరైచూర్, అన్నారం గ్రామాల్లో భూమిలో ఏర్పడే భయంకర శబ్దాలతో ఆ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత 15 రోజుల్లోనే దాదాపుగా మూడుసార్లు ఈవిధంగా ఏర్పడిందని, భూమి కంపించినట్లు, భూమిలో పెద్దపాటి పేలుడు శబ్దం వస్తున్నదని గ్రామస్తులు పేర్కొన్నారు. భూ కంపమా..? లేక మరేంటో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి 7.30 ప్రాంతంలోనే రెండుసార్లు శబ్దాలు వచ్చాయని, ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ఏర్పడుతుందోనని భయపడుతున్నట్లు తెలిపారు. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి భూమిలోని శబ్దాలపై పరిశీలించాలని కోరుతున్నారు.

## మున్సిపాలిటీ ఏర్పాటుతో పంచాయతీ కార్యదర్శులకు నూతన పోస్టులు

మొయినాబాద్, జనవరి 29 : మొయినాబాద్ మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలను కలుపుతూ మొయినాబాద్ కేంద్రంగా మున్సిపాలిటీని చేస్తూ ప్రభుత్వం అర్డినెన్స్ తీసుకొచ్చిన విషయం తెలిసిందే. మున్సిపాలిటిలో అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చిలుకూరు, ఎన్కేపల్లి, మొయినాబాద్, సురంగల్, ముర్తుజాగూడ, పెద్దమంగళారం గ్రామపంచాయతీలను విలీనం చేశారు. మున్సిపాలిటీలో విలీనం కాక ముందు ఉన్న గ్రామపంచాయతీల కార్యదర్శులకు ప్రభుత్వం కొత్త పోస్టులను కేటాయించింది. మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శరత్‌చంద్ర వారికి మంగళవారం నియామక పత్రాలను అందించారు. గ్రేడ్-1 అధికారులుగా ముగ్గురు, గ్రేడ్-2 అధికారులుగా ఇద్దరు, గ్రేడ్-3 అధికారిగా ఒకరు, గ్రేడ్-4 అధికారులుగా ఇద్దరు నియమితులయ్యారు.

### మున్సిపల్‌లో కార్యదర్శులకు కేటాయించిన పోస్టులు

| గ్రామపంచాయతీ | కార్యదర్శి | హోదా | సెక్షన్ |
|---|---|---|---|
| అజీజ్‌నగర్ | ఎస్‌కే జమీల్‌అహ్మద్ | గ్రేడ్-1 | మేనేజర్ |
| హిమాయత్‌నగర్ | ఎస్ సంధ్యరాణి | గ్రేడ్-1 | రెవెన్యూ |
| పెద్దమంగళారం | వెంకటయ్య | గ్రేడ్-1 | ఎంఈపీఎంఏ |
| మొయినాబాద్ | సుదర్శన్ | గ్రేడ్-2 | టౌన్ ప్లానింగ్ |
| ఎన్కేపల్లి | వెంకటేశ్వర్‌రెడ్డి | గ్రేడ్-2 | శానిటేషన్ |
| చిలుకూరు | కె.వెంకటేశ్ | గ్రేడ్-3 | ఎస్టాబ్లిష్‌మెంట్ |
| సురంగల్ | రామకృష్ణారెడ్డి | గ్రేడ్-4 | ఇంజినీరింగ్ |
| ముర్తుజాగూడ | శ్రీనివాస్ | గ్రేడ్-4 | అకౌంట్స్ |

## రెండున్నర గంటలు.. స్తంభించిన మెట్రో

### సిగ్నల్ వ్యవస్థలో ఇబ్బందుల కారణంగా నిలిచిన సేవలు.. ప్రయాణికుల అవస్థలు

సిటీబ్యూరో: హైదరాబాద్‌లో మెట్రో సేవలు ఒక్కసారిగా స్తంభించాయి. సాంకేతిక కారణాలతో పలు మార్గాల్లో సర్వీసులు ఆగిపోయాయి. ప్రధానంగా నిత్యం రద్దీ ఉండే నాగోల్-హైటెక్ సిటీలో రెండున్నర గంటల పాటు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 6.30 గంటల నుంచే తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులకు నిత్యం మెట్రో మార్గంలో ప్రయాణించేవారంతా అవస్థలుపడ్డారు. బుధవారం ఉదయం నాగోల్ నుంచి రాయదుర్గం మార్గంలో సిగ్నలింగ్ వ్యవస్థలో సమస్యలు తలెత్తాయి. ఉదయాన్నే ఒక్కసారిగా ఐటీ కారిడార్ ఉద్యోగులతో నిండిపోయే నాగోల్ మార్గంలోని పలు స్టేషన్లీ రద్దీగా మారిపోయాయి. గంటల తరబడి రాకపోకలు నిలిచిపోవడం, పునరుద్ధరణకు గంటల కొద్దీ సమయం పట్టింది. దీంతో ప్రధానంగా ఆఫీసులకు వెళ్లేందుకు కేవలం మెట్రోనూ ఆశ్రయించేవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

### ఇతర మార్గాల్లో రాకపోకలు

రోజు వెళ్లే మార్గం ఒక్కసారిగా మూసుకుపోవడంతో జనాలకు ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా నాగోల్ నుంచి రాయ్‌దుర్గం వరకు వెళ్లేవారు, అదేవిధంగా అమీర్‌పేట నుంచి ఐటీ కారిడార్‌లో ప్రయాణించేవారు ఇరుక్కుపోయామనే భావనతో తీవ్ర అసహనానికి గురయ్యారు. దీనికి ప్రధాన కారణం ఉదయం నుంచే సిగ్నలింగ్ వ్యవస్థలో టెక్నికల్ సమస్యలు తలెత్తుతున్నాయి. కానీ ఎల్ అండ్ టీ వాటిపై దృష్టి పెట్టలేదు. సోషల్ మీడియాలో ప్రయాణికులు స్పందించడంతో పునరుద్ధరణకు చర్యలు తీసుకుని పనులు మొదలుపెట్టారు. ఎలాంటి ప్రకటన లేకుండా రెండున్నర గంటలపాటు మెట్రో రాకపోకల్లో అంతరాయం ఏర్పడటంతో... ఇతర మార్గాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు. ముఖ్యంగా నాగోల్, అమీర్‌పేట వద్ద ఇతర మార్గాల్లో వెళ్లిపోయారు.

# 30 రోజులు.. 5 కాలేయ మార్పిడులు

### మరో రికార్డు సృష్టించిన ఉస్మానియా వైద్యులు
### పైసా ఖర్చు లేకుండా రూ.1.5కోట్ల విలువైన చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న ఉస్మానియా వైద్యులు

సిటీబ్యూరో/సుల్తాన్‌బజార్: ధర్మాసుపత్రిగా పేరుగాంచిన ఉస్మానియా దవాఖాన మరో రికార్డు సృష్టించింది. ఉస్మానియా వైద్యులు కేవలం 30 రోజుల్లో 5 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా జరిపి మరో రికార్డు సొంతం చేసుకున్నారు. నెలరోజుల కాల వ్యవధిలో ఒకటి కంటే ఎక్కువ కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు జరిపిన దాఖలాలు దేశంలోని ప్రభుత్వ రంగ దవాఖానల్లో ఎక్కడా లేదని, ప్రభుత్వ రంగ దవాఖానలో తొలిసారిగా 30 రోజుల్లో ఐదు కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు జరిపిన ఘనత ఉస్మానియాకే దక్కిందని వైద్యాధికారులు చెప్పారు. ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సాహెతో కలిసి సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి డా.మధుసూదన్ కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెంకు చెందిన జోసోబు, పూజిత వృత్తిరీత్యా దినసరి కూలీలు. వీరిది మేనరిక వివాహం. ఈ దంపతుల మొదటి సంతానం టైరోసినిమియా టైప్-1 డిసీజ్ కారణంగా 4 నెలల వయస్సులోనే మృతి చెందాడు. వీరి రెండో సంతానమైన అజిత్‌కుమార్(2) సైతం టైరోసినిమియా టైప్ 1 డిసీజ్ తో బాధపడతున్నాడు. దీని కారణంగా కాలేయ క్యాన్సర్, క్రానిక్ లివర్ డిసీజ్‌కు గురయ్యాడు. దీంతో బాలుడి కాలేయం విఫలమైంది. బాలుడి పరిస్థితి రోజురోజుకు విషమించడంతో తల్లిదండ్రులు నగరంలోని పలు కార్పొరేట్ దవాఖానలకు తిరిగారు.ఈ సర్జరీకి ప్రైవేట్ హాస్పిటల్‌లో రూ.30 లక్షల నుంచి రూ.40లక్షల వరకు ఖర్చవుతుందని అక్కడి ప్రైవేటు దవాఖాన వారు చెప్పడంతో.. అంత ఆర్థిక స్థోమత లేని బాధిత కుటుంబం ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి డా.మధుసూదన్‌ను సంప్రదించారు. టైరోసినిమియా కారణంగా బాలుడి కాలేయం పూర్తిగా దెబ్బతిన్నదని నిర్ధారించి, కాలేయ మారిప్పడి శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేయించారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.30లక్షల నుంచి రూ.40లక్షల ఖరీదైన శస్త్రచికిత్సను పైసా ఖర్చు లేకుండా లివింగ్ డోనర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌ను ఉచితంగా జరిపారు. ఈ సర్జరీలో రోగికి అతడి అమ్మమ్మ కాలేయంలో నుంచి కొంతభాగాన్ని తీసి బాలుడికి మార్పిడి చేసినట్లు డాక్టర్ వివరించారు.

### జన్యుపరమైన వ్యాధి కారణంగా..

సూర్య పేట జిల్లా, రాణి గూడెం ప్రాంతానికి చెందిన వీరస్వామి, నాగజ్యోతి దంపతుల కుమారుడు సాత్విక్ గౌడ్(7) విల్సన్స్ అనే జన్యుపరమైన వ్యాధి కారణంగా డీ-కంపెన్సేషన్‌తో ఏర్పడే క్రానిక్ లివర్ డిసీజ్‌తో బాధపడుతున్నాడు. సాధారణంగా మనం తీసుకునే ఆహారంలో రాగి అంటే కాపర్ ఉంటుంది. దీనిని కాలేయంలో ఉండే సెరలోప్లాసిస్ అనే పదార్థం కాపర్‌ను గ్రహించి మలం ద్వారా బయటకు పంపిస్తుంది. అయితే విల్సన్ రుగ్మత గల రోగుల్లో సెరలోప్లాసిస్ లోపం వల్ల ఈ కాపర్ అనేది బయటకు పోకుండా కాలేయం, మెదడులో పేరుకుపోతున్నది. ఇది సిర్రోసిస్, వణుకు, వికృతమైన నడక, కళ్లో కేఎఫ్ రింగ్‌లు, హెమోలిటిక్ రక్తహీనతకు కారణమవుతుంది. కాలేయం విఫలమవుతుంది. విల్సన్ రుగ్మత కారణంగా సాత్విక్ కాలేయం విఫలమైంది. బాలుడి కుటుంబ సభ్యులు నగరంలోని పలు ప్రైవేటు దవాఖానలను సంప్రదించగా అక్కడ రూ.30 లక్షలకు పైగా ఖర్చవుతుందని చెప్పడంతో ఆర్థిక స్థోమత లేని కుటుంబ సభ్యులు బాలుడిని ఉస్మానియాకు తీసుకువచ్చారు. వైద్యపరీక్షలు జరిపిన వైద్య బృందం బాలుడికి కాలేయ మార్పిడికి ఏర్పాట్లు చేశారు.ఇందులో భాగంగా రోగి తల్లి నాగజ్యోతి కాలేయం ఎడమ భాగం నుంచి కొంత భాగాన్ని తీసి బాలుడికి లైవ్ డోనర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ జరిపారు. అలాగే జోగులాంబ గద్వాల జిల్లా, ఎడిగోనపల్లికి చెందిన వెంకటేశ్(20) విల్సన్ రుగ్మత కారణంగా సిరోసిస్‌తో బాధపడుతున్నాడు. హన్మకొండ ప్రాంతానికి చెందిన ఎం.హర్షప్రియ న్యూరో విల్సన్ రుగ్మతతో బాధపడుతున్నది. ఈ రోగులిద్దరూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో ఆర్థిక స్థోమత లేక ఉస్మానియాను ఆశ్రయించారు. ఈ మేరకు రోగులకు వైద్యపరీక్షలు జరిపించిన వైద్యులు బ్రెయిన్ డెడ్‌కు గురైన ఇద్దరు వేర్వేరు జీవన్మృతుల కాలేయాలను సేకరించి కడావర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహించారు.

### అరుదైన వ్యాధితో..

యాదాద్రి జిల్లా, బ్రాహ్మణపల్లికి చెందిన ఎం.వెంకటేశ్(40) అరుదైన బడ్ చైరి సిండ్రోమ్‌తో బాధపడుతున్నాడు. ఇది ప్రొటీన్-సీ, ప్రొటీన్-ఎస్ లోపం వల్ల వచ్చే జనటిక్ వ్యాధి. దీని కారణంగా ఇతడి కాలేయం విఫలమవ్వడంతో కాలేయ మార్పిడి తప్పనిసరైంది. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేశ్ చికిత్స కోసం ఉస్మానియాను ఆశ్రయించగా వైద్యపరీక్షలు జరిపన వైద్యులు.. రోగికి కడావర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ జరిపారు. కేవలం 30రోజుల వ్యవధిలో ఈ ఐదుమంది రోగులకు జరిపిన కాలేయ మార్పిడిలన్నీ విజయవంతమయ్యాయని, వీటి ఖరీదు ప్రైవేటు దవాఖానల్లో రూ.1.5కోట్ల వరకు ఉంటుందని వైద్యులు తెలిపారు.

## మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి

చేవెళ్లటౌన్, జనవరి 29 : కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని హామీలను ఇచ్చి ప్రజలను, రైతులను మోసం చేస్తున్నదని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి తెలిపారు .బుధవారం చేవెళ్లలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అర్థిక పరిస్థితి బాగాలేదని, కేంద్రం నుంచి వచ్చే నిధులు ఇప్పుడు దిక్కయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే పేదలకు అందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల జాడలేదని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు రైతులకు రైతు భరోసా వేయడం లేదని.. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం కిసాన్ నిధులు మాత్రమే రైతుల ఖాతాల్లో పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఉన్నారు.



ప్రజా యుద్ధనౌక, ప్రజాగాయకుడు గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాలమహనాడు రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ దిష్టిబొమ్మను మాల కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. బండి సంజయ్‌కు, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
- యాచారం, జనవరి 29

# ఎవరి వ్యూహాలు వారివే..!

### ఎన్నికల ఏడాది కావడంతో హాట్ హాట్‌గా కౌన్సిల్
### నేడు జీహెచ్‌ఎంసీ పాలకమండలి సమావేశం




సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పాలకమండలి సమావేశానికి సర్వం సిద్ధమైంది. ప్రతి మూడు నెలలకోసారి జరగాల్సిన కౌన్సిల్ దాదాపు ఆరు నెలల తర్వాత జరుగుతున్నది. అసలే ఎన్నికల ఏడాది కావడం...గడిచిన ఏడాది కాలంగా అభివృద్ధి పనులు కుంటుపడడం..రోజూరోజుకు ప్రజా సమస్యలు పెరిగిపోతున్న దరిమిలా అన్ని పార్టీల సభ్యులు ప్రజా సమస్యలే ఎజెండాగా ప్రశ్నించేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే అన్ని పార్టీలు కౌన్సిల్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాజకీయ వేడి అలుముకున్నది. మొత్తంగా గతంలో కంటే సమావేశం వాడీవేడీగా జరిగే అవకాశం ఉంది.

### కౌన్సిల్‌లో బలంగా బీఆర్‌ఎస్..

కౌన్సిల్‌లో బలంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ సభ్యులు అధికార పార్టీ లోపాలను ఎత్తి చూపేందుకు సిద్ధమయ్యారు. ఏడాది కాలంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పురోగతిలో ఉన్న ఎస్‌ఆర్‌డీపీ, ఎస్‌ఎన్‌డీపీ పనులు పూర్తి చేయలేదు. ముఖ్యంగా ఏడాది కాలంగా కొత్త ప్రాజెక్టులు లేకపోవడం, వీధి లైట్ల నిర్వహణ లోపాలు, బడ్జెట్ కేటాయింపుల ప్రధాన అస్త్రాలుగా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ఎండగట్టనున్నారు. ఇటీవల గ్రేటర్ బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులంతా కమిషనర్ ఇలంబర్తిని కలిసి నియోజకవర్గాల వారీగా సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. ఇదే క్రమంలో బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచిన కాంగ్రెస్‌లో చేరిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డిపై తమ నిరసనను వ్యక్తం చేయనున్నారు. కాగా, అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు బుధవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులతో సమావేశమయ్యారు. అటెన్షన్ డైవర్షన్ విధానాన్నే అవలంభించాలని వారికి చెప్పినట్లు తెలుస్తున్నది. కాగా, మేయర్ మాత్రం ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌ను ఆమోదింపజేయడమే లక్ష్యంగా సభ నిర్వహణ జరిపే ఆస్కారం ఉందన్న చర్చ ఉంది.

### సభ సజావుగా సాగేనా?

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 10.30 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభం కానున్నది. తొలుత దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం ప్రకటించనున్నారు. ఆ తర్వాత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించనున్నారు. ఆ తర్వాత మేయర్ బడ్జెట్ ప్రసంగం ఐదు నిమిషాల పాటు ఉండనున్నది. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపిన ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టి చర్చ పెట్టనున్నారు. అయితే బడ్జెట్ ప్రసంగంపై చర్చ ఏ మేర జరుగుతుంది? బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్, కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ సభ్యుల మధ్య మాటల తూటాలు పేలే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి. ఐతే కౌన్సిల్ సందర్భంగా వివిధ పార్టీల సభ్యుల నుంచి 125 ప్రశ్నలు రాగా..అందులో 19 ప్రశ్నలను మాత్రమే ఎంపిక చేశారు.